## క్లుప్తంగా

### చెస్ విజేతలకు అభినందన



చెస్ విజేతలను అభినందించిన జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ప్రసాద్

ఏలూరు రూరల్: చెస్ సాధన పిల్లల్లో తెలివితేటలు, ఆలోచనాశక్తి పెంచుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఇటీవల భీమవరంలో జరిగిన అంతర్జాతీయ చెస్ పోటీల్లో పతకాలు సాధించిన ఏలూరుకు చెందిన అమలోద్భవి స్కూల్ విద్యార్థులు గంజి అనురూప్‌మోషే, అభిషేక్ అబ్రహం, బళ్ల వీఎస్‌రాజ్‌లను ఆమె తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వారికి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. వీరు మరిన్ని పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిన్నారులను మరింత ప్రోత్సహిస్తామని వైఎస్సార్ సీపీ నేత ఘంటా ప్రసాద్ హామీ ఇచ్చారు. విద్యార్థుల వెంట చెస్ అకాడమీ డైరెక్టర్ యోహనాన్ ఉన్నారు.

### వైవీ సుబ్బారెడ్డికి దళిత జేఏసీ చైర్మన్ అభినందన



వైవీ సుబ్బారెడ్డికి అభినందిస్తున్న దళిత జేఏసీ చైర్మన్ వరప్రసాదరావు

ఏలూరు (టూటౌన్): రాజ్యసభకు రెండోసారి ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డికి జాతీయ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు అభినందనలు తెలిపారు. ఈ మేరకు తాడేపల్లిలో మంగళవారం సుబ్బారెడ్డిని ఆయన నివాసంలో కలిసినట్టు చెప్పారు. సుబ్బారెడ్డి నీతి, నిజాయితీకి నిలువటద్దమని, పేదల కోసం నిరంతరం పోరాటం చేసే వ్యక్తని కొనియాడారు. ఆయన్ని రెండోసారి పెద్దల సభకు ఎంపిక చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### యాజమాన్య పద్ధతులతో మేలు

పెదవేగి : మొక్కజొన్న సాగులో క్షేత్రస్థాయి నుంచే యాజమాన్య పద్ధతులతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కేంద్ర సమగ్ర సస్యరక్షణ ఏపీపీఓ సురేష్ అన్నారు. పెదవేగి మండలం పెదకడిమి, అమ్మపాలెం గ్రామాల్లో మొక్కజొన్న పంట సాగుపై కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం విజయవాడ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ విభాగం ప్రకృతి వ్యవసాయ అధికారుల బృందం మంగళవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు మొక్కజొన్న పంట సాగులో క్షేత్ర స్థాయి నుంచే తీసుకోవాల్సిన మెళకువలు, యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, పంట ఎదుగుదల సమయంలో పాలపొట్ట దశ ఏర్పడక ముందు, తరువాత పంటకు అందించే ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు సమగ్ర సస్యరక్షణ పరికరాలు, లింగాకర్షక బట్టలు పంపిణీ చేశారు. పురుగు మందులు వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పెదవేగి ఏఓ, కేంద్ర సమగ్ర సస్యరక్షణ కేంద్రం విజయవాడ బృందం అధికారులు ఏపీపీఓ, దక్షిణామూర్తి, వీరబాబు, విమల, పెదకడిమి అమ్మపాలెం రైతులు పాల్గొన్నారు.

### హోటల్‌పై కేసు నమోదు

ఉంగుటూరు: నారాయణపురం సెంటర్లోని ఓ హోటల్‌పై విజలన్సు అధికారులు మంగళవారం దాడి చేశారు. గృహ అవసరాలకు వినియోగించే 8 గ్యాస్ సిలిండర్లు గుర్తించి, హోటల్ యజమానిపై కేసు నమోదుచేశారు. ఈ సిలిండర్ల విలువ రూ.22,191 అని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

# ఏలూరు నగరం.. అభివృద్ధి పథం

- 10 రోజుల్లో రూ.20.44 కోట్ల పనులకు శంకుస్థాపన
- రూ.41 కోట్లతో వాడవాడలా సీసీ రోడ్ల నిర్మాణం
- శరవేగంగా పూర్తవుతున్న పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని చిత్రంలో మేయర్ నూర్జహాన్ (ఫైల్)



వన్‌టౌన్ ఫిల్‌హౌస్‌పేట రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, పార్టీ క్లస్టర్-1 పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకెళుతోంది. ఏలూరు నగరంలో శరవేగంగా అభివృద్ధి వైపు పయనిస్తోంది. వెనుకబడిన ప్రాంతాల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనపై ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆళ్ల నాని ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక సమస్యల పరిష్కారానికి భారీగా నిధులు సమకూర్చారు. ఈ నిధులతో నగరంలో ప్రతి డివిజన్‌లోనూ సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, కల్వర్టులు, బోర్‌వెల్స్, తాగు నీటి సరఫరా పైపులైన్లు నిర్మిస్తున్నారు. గత నెల రోజులుగా భారీ ఎత్తున శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎమ్మెల్యే నాని ముందుకెళుతున్నారు.




**రూ.41 కోట్లతో అభివృద్ధి పనులు**

గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.30 కోట్లతో పాటు ఏలూరు నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.11 కోట్లు వెచ్చిస్తూ నగరంలోని వాడవాడలా అభివృద్ధి బాటలు వేస్తున్నారు. 10 రోజుల్లోనే రూ. 20.44 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాని శంకుస్థాపనలు చేశారు. ఈ పనులు వెనువెంటనే ప్రారంభించి ప్రగతి పథంలో ఉండటం విశేషం. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫిల్‌హౌస్‌పేట ప్రధాన రహదారిని రూ.1.50 కోట్లతో నిర్మిస్తుండగా, ఇందిరమ్మ కాలనీలో మరో రూ.1.50 కోట్లతో రోడ్డు నిర్మాణం, వేణుగోపాలస్వామి గుడి ప్రాంతంలో మరో రూ. 90 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి.

- ఈ నెల 12వ తేదీన ఎమ్మెల్యే నాని, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి 11వ డివిజన్‌లో రూ. 2.25 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, 12వ డివిజన్‌లో రూ.1.09 కోట్లతో, 14వ డివిజన్‌లో రూ.1.02 కోట్లతో, 15వ డివిజన్‌లో రూ.1.01 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.
- ఈ నెల 14వ తేదీన ఏలూరు 30వ డివిజన్ మోతేవారితోట ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.80 లక్షలు, నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ. 38.04 లక్షలతో 19 సీసీ రోడ్లు, 6 సీసీ డ్రెయిన్లు, ఒక అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి, 37వ డివిజలో రూ.20 లక్షల జీజీపీఎం నిధులతో 3 సీసీ రోడ్లు, ఒక డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 38వ డివిజన్‌లో రూ.80 లక్షల నిధులతో 9 సీసీ రోడ్లు, 9 సీసీ డ్రెయిన్లు, 39వ డివిజన్‌లో రూ.47.02 లక్షలతో 4 సీసీ రోడ్లు, 5 సీసీ డ్రెయిన్లు, ఒక తాగునీటి పైపులైను నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- ఈ నెల 16వ తేదీన 46వ డివిజన్‌లో రూ.17 లక్షలతో నిర్మించిన రజక భవనాన్ని, రూ. 10 లక్షలతో నిర్మించిన ముస్లిం షాదీఖానా భవనాన్ని ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్ ప్రారంభించారు. రూ.78 లక్షలతో 5 సీసీ డ్రెయిన్లు, 5 సీసీ రోడ్లు, 27వ డివిజన్‌లో రూ.87 లక్షలతో 11 సీసీ రోడ్లు, 7 డ్రెయిన్లు, 26వ డివిజన్‌లో రూ.98 లక్షలతో 10 సీసీ రోడ్లు, 10 సీసీ డ్రెయిన్లు, ప్రజల తాగునీటి సరఫరా పైపులైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే నాని శంకుస్థాపన చేశారు.
- ఈ నెల18వ తేదీన 29వ డివిజన్‌లో రూ.1.57 కోట్లతో 11 సీసీ రోడ్లు, 20 సీసీ డ్రెయిన్లు, 28వ డివిజన్‌లో రూ.60 లక్షలతో 9 సీసీ రోడ్లు, 4 సీసీ డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.
- ఈనెల 19న 19వ డివిజన్‌లో రూ.1.04 కోట్ల నిధులతో 10 సీసీ రోడ్లు, 5 సీసీ డ్రెయిన్లు, 3 పైపు లైన్లు, ఒక బోరువెల్ నిర్మాణం, 18వ డివిజన్‌లో రూ.1.37 కోట్లతో 24 సీసీ రోడ్లు, 7 సీసీ డ్రెయిన్లు, 17వ డివిజన్‌లో రూ.84 లక్షలతో 15 సీసీ రోడ్లు, 7 సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

### ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సదుపాయాలు



ఏలూరు నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మొత్తం 50 డివిజన్లల్లోనూ ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. ఒకవైపు పనులు శరవేగంగా సాగుతుండగా మరోవైపు కొత్తగా మరికొన్ని పనులకు శంకుస్థాపనలు చేస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఏలూరు నగరానికి భారీగా నిధులు తీసుకొచ్చాం. రాబోయే కాలంలో మరింత అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉన్నాం.

– ఆళ్ల నాని, ఎమ్మెల్యే

### ప్రగతి పథంలో పనులు



ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాం. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో నగర మేయర్ నూర్జహాన్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు ప్రగతి పథంలో ఉన్నాయి. ఇప్పటికే ఏలూరు నగరంలో వందలాది అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, కొత్తగా మరిన్ని పనులను చేపట్టేందుకు ఎమ్మెల్యే నాని శంకుస్థాపనలు చేశారు. ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.

– సంక్రాంతి వెంకటకృష్ణ, నగర కమిషనర్

### ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

ఏలూరు రూరల్: ఆశ్రం వైద్య కళాశాల ఆవరణలో 19వ గ్రాడ్యుయేషన్ డే మంగళవారం సాయంత్రం ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌గా సీనియర్ డయాబెటిస్ స్పెషలిస్ట్ ప్రొఫెసర్ జీఎస్ కృష్ణ, ప్రత్యేక గెస్ట్‌గా రమేష్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ పి.రమేష్‌బాబు హాజరయ్యారు. గ్రాడ్యేషన్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రం చైర్మన్ గోకరాజు గంగరాజు, వైస్‌చైర్మన్ జీవీకే రంగరాజు, కార్యదర్శి గోకరాజు రామరాజు, డైరెక్టర్ జి.రతీదేవి, అకడమిక్ డైరక్టర్ కె.అంజిరెడ్డి, సూపరింటెండెంట్ కె.శాంతయ్య పాల్గొన్నారు.

### జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



శిబిరంలో మందులను అందిస్తున్న సిబ్బంది

భీమడోలు: గుండుగొలను పంచాయతీ పరిధిలోని భోగాపురం సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరానికి రోగుల పోటెత్తారు. 453 మంది హాజరుకాగా, వీరికి వైద్యులు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ కంటి వెలుగులో కంటి వైద్య నిపుణులు కంటి పరీక్షలు చేశారు. రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు, ఈసీజీలు నిర్వహించారు. ఉచితంగా మందులను అందించారు. నలుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. తొలుత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీడీఓ టి.స్వర్ణలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గైనకాలజిస్ట్ వై.సృజన, పిల్లల వైద్య నిపుణుడు డి.సుహాంత్, జగనరల్ వైద్యులు కె.శ్రీలక్ష్మి, జాహ్నవి శిబిరానికి వచ్చిన దీర్ఘకాలిక రోగులు, బాలింతలు, గర్భిణులు, కౌమర, నవజాతల సంరక్షణ తదితర అంశాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

# మహిళల అభివృద్ధే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న జిజ్జువరపు రవిప్రకాష్, మహిళలు

ఏలూరు (టూటౌన్): మహిళాభివృద్ధే లక్ష్యంగా మహిళా చైతన్య సేవను ఏర్పాటుచేసినట్టు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ తెలిపారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహిళా చైతన్య సేన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన బడుగు, బలహీన వర్గాల మహిళలను ఆర్థికంగా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేందుకు మహిళలను ఐక్య పరిచేందుకు మహిళా చైతన్య సేనను ఏర్పాటు చేశామన్నారు. ఈ వర్గాల మహిళలకు ప్రభుత్వం ఉచితంగా కుట్టు మెషీన్లు మంజూరు చేసి, సబ్సిడీ రుణాలు అందించాలని రవిప్రకాష్ కోరారు. సమావేశంలో మహిళా చైతన్య సేన ఏలూరు జిల్లా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, పశ్చిమగోదావరి జిల్లా మహిళా చైతన్య సేన అధ్యక్షురాలు దిరుసు పాముల పుష్ప, ఏలూరు నగర అధ్యక్షురాలు సువార్త, తదితరులు పాల్గొన్నారు.

### హాల్ టికెట్లు ఇవ్వని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



ప్రభాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా వేధిస్తోన్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు జిల్లా వృత్తివిద్యాధికారి బి.ప్రభాకర్‌ను కోరారు. ఈ మేరకు మంగళ వారం ఆయన కార్యాలయంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు పూర్తి ఫీజు కడితేగాని హాల్ టికెట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. గత డిసెంబర్‌లో 80 శాతం ఫీజు కడితేనే పరీక్ష ఫీజు కట్టించుకుంటామని విద్యార్థులను బెదిరించారని, ఫీజులు వసూలు చేశారని, తాజాగా పూర్తి ఫీజు కడితేగాని హాల్ టికెట్లు ఇచ్చేది లేదని చాలా యాజమాన్యాలు చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా మాదిరిగా యాజమాన్యాల ప్రమేయం లేకుండా విద్యార్థులే నేరుగా హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకునే లింకును ఇంటర్మీడియట్ బోర్డు త్వరగా విడుదల చేసే విధంగా మంత్రి బొత్స సత్యనారాయణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి, నగర కమిటీ సభ్యులు ఎస్ సునీల్, ఎ.రాజు పాల్గొన్నారు.

### జూదరుల అరెస్ట్

దెందులూరు: మండలంలోని పోతునూరు గ్రామంలో మంగళవారం రాత్రి కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై కె.స్వామి తెలిపారు. వారి నుంచి ఐదు కోడి పుంజులు, రూ.2 వేలు నగదు, 18 కోడి కత్తులు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

# రేపటి నుంచి రామకోటి మహోత్సవాలు



ఉత్సవాల బుక్‌లెట్ విడుదల చేసిన విశ్వశాంతి సమాజం ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో 91వ శ్రీ రామకోటి మహోత్సవాలు ఈనెల 22 గురువారం నుంచి మార్చి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా నిత్యం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, ప్రత్యేక పూజలు, శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ నెల 23 నుంచి 26 వరకు దుర్గా సప్తశతి బృందం ఆధ్వర్యంలో లలితా సహస్రనామ కోటి కుంకుమార్చన, 27, 28 తేదీల్లో వద్దిపర్తి పద్మాకర్ ఆధ్యాత్మిక ప్రవచనం, మార్చి 1న ఉదయం అనఘాష్టమి వ్రతం, సాయంత్రం రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటక ప్రదర్శన, 3న హైస్కూల్ విద్యార్థులకు భారతం, రామాయణం అంశాలపై క్విజ్ పోటీలు, 6న సత్యనారాయణ స్వామి వ్రతాలు, 8న మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం, జ్యోతిర్లింగార్చన, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. 10వ తేదీ సాయంత్రం అన్నమయ్య సంకీర్తనాలాపన, సంగీత వాద్య సమ్మేళన కార్యక్రమాలు, 11, 12 తేదీల్లో టీవీ కళాకారుడు నోరి నారాయణమూర్తి సుందరకాండ పారాయణ, 15న శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటక ప్రదర్శన, 16న ఉత్సవ మహాపూర్ణాహుతి, రాత్రి స్వామి వారి పవళింపు సేవ, ఘంటసాల భక్తిరంజని, 17న ఉత్సవాల ముగింపు సందర్భంగా మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, రాత్రి వీరాభిమన్యు బుర్రకథ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో నగరంలోని భక్తులంతా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్సవాల బుక్‌లెట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రామకోటి విశ్వశాంతి సమాజం ప్రతినిధులు వేమా సురేష్ కుమార్, మానేపల్లి రామారావు, మారం హనుమంతరావు, ఆర్ బలరాం, జి.యశ్వంత్, శోడిశెట్టి సురేష్ పాల్గొన్నారు.

# చట్టాలపై విద్యార్థులకు అవగాహన




మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమాజంలోని సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించేందుకు, సామాజిక న్యాయం అందించేందుకు రాజ్యాంగం ప్రామాణికంగా ప్రజలకు కల్పించిన చట్టాలు ఉపయోగపడతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళ వారం జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌ఆర్ పేటలోని ఎస్వీఆర్‌కే డిగ్రీ కళాశాలలో ఆయా చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ అసమానతలు తొలగించడానికి అట్టడుగు వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించడం, ఆర్థిక వెసులుబాటు కల్పించడం వంటి చర్యలు ప్రభుత్వాలు తీసుకుంటున్నాయని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి అవసరమైన న్యాయ సహాయం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ప్యానల్ అడ్వకేట్ కూన కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల అవగాహనతో ఉండాలని, సమాజంలో నేడు వాహన ప్రమాదాలు విపరీతంగా పెరిగాయని, ప్రతి పౌరుడూ ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. లైసెన్స్ పొందే వాహనాలు నడపాలని, ప్రతి పౌరుడూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని అన్నారు. విద్యార్థులు సోషల్ మీడియా ఉపయోగించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# వలంటీరు వ్యవస్థ దేశానికే ఆదర్శం



భీమడోలులో వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న వలంటీర్లు సేవాభావానికి ప్రతీకలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణపవరం మండలంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో వాసుబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మానసపుత్రిక వలంటీరు వ్యవస్థ అని, ఈ వ్యవస్థ నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఈ వ్యవస్థను కించపరిచేలా ప్రతిపక్షాలు, పచ్చ మీడియా చేస్తోన్న దుష్ప్రచారానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందజేస్తూ, ప్రజాభిమానాన్ని పొందుతున్న వలంటీర్లను దొంగలు, దోపిడీదారులు, హంతకులుగా ప్రచారం చేయడం దారుణమన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా, కుటుంబాన్ని వదలి ప్రజల ప్రాణాలు కాపాడటానికే ప్రాధాన్యత ఇచ్చిన వలంటీర్ల సేవలను ప్రజలు, ప్రభుత్వం ఎప్పటికీ మరువదని తెలిపారు. జగన్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావడానికి పార్టీ శ్రేణులతో పాటు వలంటీర్లు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం వలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. గణపవరం మండలంలోని 376 మంది వలంటీర్లలో ఇద్దరికి సేవా రత్న, ఐదుగురికి సేవా వజ్ర, 369 మందికి ఉత్తమ వలంటీరు పురస్కారాలను ప్రదానం చేశారు. రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ దండు రాము, ఎంపీడీఓ ఎంఎస్ ప్రభాకరరావు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, సర్పంచ్ మూర అలంకారం, మండల ఉపాధ్యక్షురాలు సలాది రత్నకుమారి, పార్టీ నాయకులు రొంగల శ్రీను, మండల గృహసారథుల కన్వీనర్ ఎంఆర్‌కే, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

**వలంటీర్లు ప్రజాసేవకే అంకితం**

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక వలంటీర్లు సేవే లక్ష్యంగా పని చేస్తే ప్రజల గుండెల్లో నిలిచిపోయారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలులో మంగళవారం రాత్రి వలంటీర్ల వందనం కార్యక్రమం సర్పంచ్ పాము సునీత అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వాసుబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రతి పథకాన్నీ అవినీతిమయం చేసి ప్రజలను దోచుకున్నారని, ఫలితంగా గత ఎన్నికల్లో చంద్రబాబు అండ్ కోకు ప్రజలు దిమ్మతిరిగే షాక్ ఇచ్చి ఇంటికి పంపించారని గుర్తుచేశారు. వలంటీర్లు కోవిడ్ కష్టకాలంలో ఏ పథకం ఆగకుండా ముందుకు సాగిందంటే ఒక్క వలంటీర్ల వల్లే సాధ్యమైందని కొనియాడారు. అనంతరం సేవా మిత్ర, రత్న, వజ్ర అవార్డు గ్రహీతలు 342 మందిని వాసుబాబు శాలువాలను కప్పి ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమ, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్య శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీడీఓ టి.స్వర్ణలత, ఆర్‌బీకేల చైర్మన్ పి.సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, యూత్ మండల అధ్యక్షుడు మద్దుల రాజా, గ్రామకార్యదర్శి నందేటి ఠాగూర్, ఎంపీటీసీలు అంబటి దేవి, గంటా శ్రీనివాసరావు, పొల్నాటి శ్రీను, విజయభాను, ఆజామ్, సర్పంచులు దాయం సుజాత, వెజ్జు బాలాజీ, నీలం శ్రీనువాసరావు, గుడివాడ నాగగౌతమి, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్ పాల్గొన్నారు.

### కొల్లేరులో చేపల చెరువులు తవ్వితే సహించం

భీమడోలు: కొల్లేరు అభయారణ్యంలో అక్రమంగా చెరువులు తవ్వితే సహించేది లేదని విజిలెన్స్, ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారులు హెచ్చరించారు. కొల్లేరు అభయారణ్యంలో కొందరు చేపల చెర్వులను తవ్వుతున్నట్లు ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లడంతో రెండు రోజులుగా కొల్లేరు ప్రాంతాలను బృందాలు విస్తృతంగా పర్యటించారు. మంగళవారం లక్ష్మీపురంలోని గుంటూరు, రాజమండ్రి, వైజాగ్ విజిలెన్స్, ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారుల బృందం కొల్లేరు ప్రాంతాన్ని సందర్శించారు. కొల్లేరు సరిహద్దులను పరిశీలించారు. ఎక్కడా చేపల చెరువులు తవ్వడం లేదని డీఎఫ్ఓ ఎం.హిమశైలజ తెలిపారు.

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర) | 21.00 | 28 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 42 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.30 | 43 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 16.00 | 00 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 21 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 09 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 25 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 28 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 29 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 21.00 | 4804 | 32 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 22 |
| ఏలూరు - విశాఖపట్నం | 12.00 | 4840 | 34 |